AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

24-10-2026 (Saturday) MAIN EDITION

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి : ఏపీ సీఎం చంద్రబాబు




అక్షరటుడే, ఏపీ : ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కొందరు ఇష్టానుసారంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాల్లో ఇలాంటి క్రిమినల్స్‌ను ఎప్పుడూ చూడలేదన్నారు. ఇప్పుడు రౌడీలే రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేత హిట్ అండ్ రన్ చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు జరగకుండా వైసీపీ అరాచకాలు సృష్టిస్తోందన్నారు.

జిలెటిన్ స్టిక్స్ పేలి ఐదుగురు మృతి




అక్షరటుడే, ఏపీ : ఏపీలోని అల్లూరి జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. అనంతగిరి మండలం పినకోట వద్ద జిలెటిన్ స్టిక్స్ పేలి ఒక ఉపాధ్యాయురాలితో సహా ఐదుగురు మృతి చెందారు. శనివారం ఉదయం జిలెటిన్ స్కిక్స్ అమర్చిన యంత్రంలో డీజిల్ నింపుతుండగా.. ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. అనంతరం పేలుడు చోటు చేసుకుంది. మృతుల్లో టీచర్ సునీత, కార్మికుడు మణి, నారాయణరావు, పవన్, డ్రైవర్ ఉన్నట్లు గుర్తించారు.

ఐపీవోకు వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ కంపెనీ..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్మెంటల్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీని ఐపీవోకు వచ్చింది. ఐపీవో ద్వారా మొత్తం రూ. 667.53 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ ఐపీవో అక్టోబర్ 27న ప్రారంభమై, 29 వరకు అందుబాటులో ఉంటుంది. అక్టోబర్ 30న రాత్రి షేర్స్ అలాట్‌మెంట్ స్టేటస్ వెల్లడి కానుంది.

అదానీ పవర్ దూకుడు..




అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశంలో కరెంట్ డిమాండ్ పెరగడంతో అదానీ పవర్ సెప్టెంబర్ త్రైమాసికంలో ఆదాయాలలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది. నికర లాభం గతేడాదితో పోల్చితే 134 శాతం పెరిగింది. రూ. 2,953 కోట్ల నుంచి రూ. 6,919 కోట్లకు చేరింది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం సైతం 45 శాతం ఎగబాకింది.

భారీగా విదేశీ కరెన్సీ పట్టివేత



అక్షరటుడే, శంషాబాద్ : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కౌలాలంపూర్ వెళ్లేందుకు సిద్ధమైన ఇద్దరు ప్రయాణికుల వద్ద మొత్తం రూ.1.56 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేశారు.

విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి




అక్షరటుడే, తిరుపతి : తిరుపతిచిత్తూరు జిల్లాల సరిహద్దుల్లోని ఇరాల మండలం చుక్క వారి పల్లి గ్రామం సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో ఏనుగు మృతి చెందింది. శనివారం ఉదయం తన పొలంలో అడవి ఏనుగు అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉండటంతో రైతు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాడు. తక్కువ ఎత్తులో వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలను తాకడం వల్ల ఏనుగు విద్యుదాఘాతానికి గురై ఉండవచ్చని భావిస్తున్నారు.

గ్యాంగ్‌స్టర్ హిమాన్షు భావు అరెస్ట్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: భారత్‌లో హత్యలు, వ్యవస్థీకృత నేరాలకు సంబంధించి వాంటెడ్ జాబితాలో ఉన్న గ్యాంగ్‌స్టర్లు హిమాన్షు భావు, నీరజ్ ఫరీద్‌పురియాలను అమెరికాలో అరెస్టు చేశారు. హర్యానా స్పెషల్ టాస్క్ ఫోర్స్ అందించిన సమాచారం లాస్ వేగాస్‌లో వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వీరిని భారత్‌కు రప్పించేందుకు హర్యానా అధికారులు అమెరికా అధికారులతో, కేంద్ర దర్యాప్తు సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు.



హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడిని కొందరు క్యాష్ చేసుకుంటున్నారు. సరిపడా నీరు సరఫరా కాకపోవడంతో చాలా మంది ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో పలువురు అక్రమార్కులు కలుషిత నీటిని ప్రజలకు విక్రయిస్తున్నారు. అనుమతులు లేకుండా, అక్రమంగా నీటి దందా చేపడుతున్నారు. మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో అక్రమ నీటి దందాకు హైడ్రా అధికారులు శనివారం చెక్ పెట్టారు. - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

అక్రమ నీటి దందాకు చెక్

■ సున్నం చెరువు పరిధిలో ట్యాంకర్ల దందా ■ కలుషిత నీటి విక్రయం ■ పైప్‌లైన్‌లు తొలగించిన హైడ్రా

హైదరాబాద్ నగరంలోని మాదాపూర్‌లో గల సున్నం చెరువులో అక్రమంగా వేసిన బోర్లు, పైప్‌లైన్లను హైడ్రా అధికారులు తొలగించారు. పోలీసు భద్రత నడుమ, రెవెన్యూ, సీఎంసీ అధికారుల సమక్షంలో నిర్వహించిన ఆపరేషన్‌లో నివాస ప్రాంగణాల్లోని బోర్‌వెల్‌లకు అనుసంధానించిన పైపులను తొలగించారు. ఏళ్లుగా సున్నం చెరువు కేంద్రంగా కొందరు అక్రమంగా నీటిని తరలిస్తున్నారు. చెరువులో బోర్లు, పైప్‌లైన్‌లు వేసి.. ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు.

ఇళ్లలో నుంచి పైప్‌లైన్లు

అక్రమార్కులు సున్నం చెరువు సమీపంలోని ఇళ్ల నుంచి సైతం నీటిని తరలిస్తున్నారు. ఆయా ఇళ్లలో బోరుబావుల నుంచి పైప్‌లైన్లు వేసి, ట్యాంకర్లు నింపుతున్నారు. నివాస ప్రాంతాల నుంచి భూగర్భ జలాలను తోడి, విక్రయించడానికి వేసిన అక్రమ బోర్‌వెల్ పైప్‌లైన్‌లను తొలగించేందుకు హైడ్రా భారీ ఆపరేషన్‌ను ప్రారంభించింది.

కలుషిత నీరు

సున్నం చెరువు పరిసరాల్లోని కొన్ని నివాసాల్లో అక్రమంగా నీటిని విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మురుగునీరు, చెత్తాచెదారం మీదుగా వేసిన పైపుల వల్ల తీవ్రమైన కాలుష్య ప్రమాదం ఉందని, చిన్న పగుళ్లు కూడా నీటి సరఫరాను కలుషితం చేయగలవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.

ఇరాన్‌పై భీకర దాడులు చేస్తాం : ట్రంప్



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌ను హెచ్చరించారు. తమతో ఒప్పందం చేసుకోకపోతే భీకర దాడులు చేస్తామన్నారు. దీనిని ఆయన "లిటిల్ ఎపిక్ ఫ్యూరీ" అని అభివర్ణించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫ్లోరిడాలో జరిగిన ర్యాలీలో ట్రంప్ మాట్లాడారు. తాము మరో లిటిల్ ఎపిక్ ఫ్యూరీని చేయవచ్చన్నారు. వారు తెలివైన వారైతే ఒప్పందానికి ముందకు వస్తారని పేర్కొన్నారు.



పెరగనున్న చలితీవ్రత

అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలో నేటి నుంచి చలితీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఈ నెల 26న అర్నాబ్ అనే తుపాన్ ఏర్పడనుంది. దీని ప్రభావంతో ఉత్తర దిశ నుండి వీచే పొడి గాలులు వీస్తాయి. ఫలితంగా అక్టోబర్ 25, 26, 27 తేదీలలో తెలంగాణలో రాత్రులు చల్లగా ఉంటాయి. ఈ సమయంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 14 డిగ్రీలు నమోదు అయ్యే అవకాశం ఉంది. అంతేగాకుండా 28న మధ్యాహ్నం నుంచి 29 మధ్యాహ్నం వరకు భద్రాద్రి, ఖమ్మం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

చరిత్ర సృష్టించిన జియో ప్లాట్‌ఫామ్స్



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: రిలయన్స్ డిజిటల్, టెలికాం విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) ఐపీవో సబ్‌స్క్రిప్షన్ ఈనెల 21న ప్రారంభమై 23న ముగిసిన విషయం తెలిసిందే. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి సుమారు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన ఈ ఐపీవో పలు రికార్డులు బద్దలు కొట్టింది. రూ. 30,188 కోట్ల పబ్లిక్ ఇష్యూతో భారతదేశంలోనే అతిపెద్దదిగా నిలిచింది. దీనికి 13.8 మిలియన్లకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ బిడ్ల విలువ రూ. 4.72 లక్షల కోట్లు. అత్యంత వేగవంతంగా పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయిన మెగా ఐపీవోగా జియో ప్లాట్‌ఫామ్స్ నిలిచింది. ప్రపంచంలోనే కోటికి పైగా దరఖాస్తులను అందుకున్న మొదటి ఐపీవో కూడా ఇదే కావడం గమనార్హం.

మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం : మంత్రి పొన్నం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఉప్పల్ జోనల్ వర్క్ షాప్ వద్ద రూ.3.22 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న సిటీ బస్ టెర్మినల్‌కు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. రోజుకు సుమారు లక్ష మంది ప్రయాణికులకు సేవలందించేలా ఆధునిక మౌలిక సదుపాయాలతో ఈ బస్ టెర్మినల్ నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. 100 రోజుల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

హైదరాబాద్‌లో డ్రగ్స్ పట్టివేత



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్‌లో ఒక బస్సులో దాదాపు రూ.1.1 కోట్ల విలువైన 1.136 కిలోల మెథాంఫెటమిన్‌ను డీఆర్ఐ స్వాధీనం చేసుకుంది. నిర్దిష్ట సమాచారం మేరకు, డీఆర్ఐ, హెచ్‌జెడ్‌యూ అధికారులు భోపాల్-హైదరాబాద్ బస్సులో సోదాలు నిర్వహించారు. స్లీపర్ బెర్త్ పరుపుల కింద దాచి ఉంచిన నాలుగు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ బెర్త్‌లలోని ప్రయాణికులు భోపాల్‌లో బస్సు ఎక్కి నాగ్‌పూర్‌లో దిగినట్లు వెల్లడైంది.

ఉగ్రసంస్థలతో సంబంధాలు.. ర్యాపిడో డ్రైవర్ అరెస్ట్



అక్షరటుడే, ముంబై : ఉగ్రవాద సంస్థ జైష్ ఎ మొహమ్మద్‌తో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో ముంబైలో ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు సోషల్ మీడియా పోస్టులలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో అదుపులోకి తీసుకున్నారు. ముంబైలోని మహిమ్‌కు చెందిన మహమ్మద్ హసన్ అబు సర్మాద్ అక్తర్ తీవ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ర్యాపిడో డ్రైవర్‌గా, పెర్ఫ్యూమ్ అమ్మకందారుడిగా పని చేస్తున్న అతడికి పాకిస్తానీ గూఢచార సంస్థతో సంబంధాలు ఉన్నాయన్నారు.